# చక్రబంధంలో చిన్నారులు

- ఎమ్. హేమలత

అప్పుడే ఎమర్జన్సీ వార్డ్ లోపలకు వస్తున్న రామకృష్ణ కేసి చూస్తూ "అన్నయ్యా! చూడన్నయ్యా! నీ మేనగోడలు చూడన్నయ్యా 'మామయ్యా' అంటూ నీ చుట్టూరా గంతులేసే ఆ లేడి పిల్ల ఎంత అచేతనంగా పడివుందో చూడన్నయ్యా" అంటూ బావురుమంది శారద.

"శారూ! ఊర్కోమ్మా. నువ్వే ఇలా గగ్గోలు పెడ్తే ఎలా? రాజీవ్‌ని నొకమారు చూడు - ఎలా బెంగపడి చూస్తున్నాడో!" చెల్లెలి తల మీద చేయివేసి ఓదార్చుతూ "శారూ! గంగా ఏడమ్మా కన్పించడు!" అంటూ, బావగారి కోసం అటూ-ఇటూ చూశాడు రామకృష్ణ.

"మామయ్యా, నాన్న ఇక్కడే ఐ.సీ.యూలో వున్నారు. అక్కయ్య నిద్ర మాత్రలు మింగిందని తెలియగానే, తెలివిలేకుండా పడివున్న అక్కను చూసి కుప్ప కూలిపోయారు నాన్న. వెంటనే నాన్నని, అక్కయ్యని ఈ హాస్పిటల్లో చేర్పించాం. డాక్టర్లు నాన్నకి హార్ట్ అటాక్ వచ్చిందని ఆ రూములో వుంచారు. నిద్ర మాత్రల్ని వాంతి చేయించడానికి ఏవో ట్యూబులవీ పెట్టారు మామయ్యా - అక్క నోట్లో. నాన్నకి ఫరవాలేదంటున్నారు. కానీ, అక్కయ్య సంగతే చెప్పలేమంటున్నారు." ఏడుస్తూ చెబుతున్న మేనల్లుడు రాజీవ్‌ని చెంతకి తీసుకున్నాడు రామకృష్ణ.

శారద వద్దకు వచ్చి కూచుంది, సరోజిని - శారదవదిన. చెల్లెల్ని ఎలా ఓదార్చాలో పాలుపోక, విగత జీవిలా మంచానికి అతుక్కుపోయిన మేనగోడలు శిరీషని చూడలేక, రోదిస్తున్న రాజీవ్ భుజం మీద చేయివేసి వార్డ్ బయటకు నడిపించాడు రామకృష్ణ. డ్యూటీ డాక్టర్నడిగి అసలు విషయాలు తెల్సుకుందామని.

నిద్రమాత్రలు మింగి ఎంత సేపయిందో ఇదమిత్థంగా తేల్చి చెప్పలేక పోతున్నందువల్ల అమ్మాయి ఆరోగ్య పరిస్థితి కాస్త ఆందోళన కల్గిస్తోందనీ అమ్మాయి తండ్రి మాత్రం కోలుకుంటున్నాడని - ఆయన్ని మరో ఇరవై నాల్గు గంటలు అబ్జర్వేషన్లో వుంచాలని డాక్టరు చెప్పగా విన్న రామకృష్ణ ఇక తనక్కడ వుండి చేసేది లేక, రాజీవ్‌ను తీసుకొని ఇంటి ముఖం పట్టాడు.

అసలిదంతా ఎలా జరిగింది..... ఎందుకు జరిగింది అన్న విషయం చూచాయగా రామకృష్ణకు అర్థమవుతున్నది. గంగాధరం మొదటి నుండి కొంత కరకు మనిషే అని చెప్పాలి. పెళ్ళయిన నాటి నుండి కూడా తన పంతమే నెగ్గాలి - అను చెప్పిందే వేదం అనే రకం. ఎదుటివారు చెప్పిందాట్లో కూడా ఔచిత్యం వుంటుందని గ్రహింపు తక్కువ. ఇక శారద భర్త మాటలను ఎంత సమర్థించినా, అప్పు డప్పుడూ తన వ్యక్తిత్వాన్ని కూడా ప్రదర్శించి తన వునికిని చాటు కోవడంలో వెనక్కి తిరిగే మనిషి కాదు. అలా ఇద్దరికీ కొన్ని విషయాల్లో బేదాభిప్రా యాలు వచ్చినా మరీంత సాగదీయకుండా సంసా రాన్ని నెట్టుకొస్తున్నారు. ఇద్దరూ ఇద్దరు పిల్లల్ని అమితంగా ప్రేమిస్తారు. అదులో మాత్రం బేదాభిప్రాయాలు లేవు. పిల్లలకు ది బెస్ట్ ఎడ్యుకేషన్ ఇవ్వాలంటూ కొంత శక్తికి మించినదయినా సిటీకి దగ్గరిలో వున్న ప్రైవేట్ స్కూల్లో చేర్పించి చదివిస్తున్నారు. రానూపోనూ బస్ చార్జీలకు, ఫీజులకూ, పుస్తకాలకూ, ట్యూషన్లకి, ఎంత డబ్బు ఖర్చు పెట్టడానికైనా వెనకాడేవారు కాదు. శిరీషా, రాజీవ్ కూడా తల్లి తండ్రులు తమపై వుంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండ ప్రతి క్లాసులో ఫస్టు, సెకండ్ రాంకులు తెచ్చుకుంటూ అమ్మా నాన్నలను సంతోషపరిచేవారు.

ఇప్పుడు శిరీష ఇంటర్‌లోకి వచ్చింది. సిటీలోని ఉమన్స్ కాలేజిలో చేర్పించాలని శారద ఆశపడింది. గంగాధరం భార్యతో ఏకీభవించక సిటీకి దూరంగా వుండే రెసిడెన్షియల్ కాలేజిలో చేర్పించాడు. ఎన్నడూ తనని విడిచిపెట్టి వుండని శిరీషని రెసిడెన్షియల్ కాలేజిలో చేర్చడానికి శారద మొదట విముఖత చూపింది. కానీ కూతురు భవిష్యత్తుకు రెసిడెన్షియల్ కాలేజి అయితేనే మంచిదని, అక్కడే మంచి కోచింగ్ వుంటుందని, భర్తే కాక చాలా మంది తనతో చెప్పడంతో సమాధానపడింది. ఆ ఏడు ఆ కాలేజి ఎంసెట్ పరీక్షల్లో సాధించిన ఉత్తమ ర్యాంకుల జాబితా ఓ వార్తా పత్రిక పేజీ నిండా చూసి, 'అమ్మో! మంచి కాలేజిలోనే చేర్పించామే' అంటూ సంతోషపడింది.

అలా ప్రారంభమయింది, శిరీష కాలేజి జీవితం.

తన ఆలోచనల నుండి బయటపడిన రామకృష్ణ, బిక్క ముఖం వేసుకొని కూచున్న రాజీవ్‌ని దగ్గరికి పిలిచి, "రాజూ! అసలేమయిందిరా?" అంటూ అనునయంగా ప్రశ్నించాడు.

"ఏం లేదు మామయ్యా! నాల్గు రోజుల క్రితం సంక్రాంతి సెలవులకని అక్కయ్య ఇంటికి వచ్చింది. పండగ మూడు రోజులు హాయిగానే గడిపేసాం. అక్క మాత్రం ఎందుకో కొంత మూడీగా వుండింది. ఈ రోజే వాళ్ళ కాలేజి తెరిచే రోజు. కానీ నిన్న పొద్దున వాళ్ళ కాలేజి నుండి నెలనెలా వాళ్ళు పంపించే రిపోర్ట్ కార్డ్ వచ్చింది. అందులో అక్కకి అంత మంచి మార్కులు రాలేదు. నాన్న ఆ రిపోర్ట్ చూసి పెద్దగా అరిచి కేకలు పెట్టారు. అక్క ఏడుస్తూ కూచుంది. అమ్మ మొదట అక్కనే తిట్టింది. "అదసలే మార్కులు తక్కువ వచ్చాయని బాధపడుతుంటే, దాన్ని మరింత బాధ పెట్టకండి! స్కూల్లో ఫస్ట్ ర్యాంక్ ఒక్క మారు రాకుంటేనే ఏడ్చి గోల పెట్టే సెన్సిట్యివ్ పిల్లది. అటువంటి దాన్ని కొట్టి చంపేస్తారా!" అంది అమ్మ.

"దీని మొహానికి ఇన్ని వేలు తగలేశాను. ఎన్నో ఆశలు పెంచుకున్నాను. ఆఫీసులో, బయటా అందరితో - 'మా అమ్మాయి ఎంసెట్‌లో ర్యాంకు తెచ్చుకుంటుంది - కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో చేర్పిస్తాను' అంటూ, డంబాలు చెప్పాను. కనీసం ఈ పిల్ల ఇంటరయినా పాస్ అవుతుందో - లేదో!" అంటూ పెద్ద గొడవ చేశారు నాన్న.

అమ్మ అక్కను తీసుకొని గదిలోకి వెళ్లి పడుకుంది. నేను నాన్నతో పడుకున్నాను. తర్వాత ఏం జరిగిందో నాకు తెలీదు మామయ్యా! పొద్దున అమ్మ ఏడుస్తూ నన్ను లేపడంతో లేచిన నాకు నాన్న మంచం పక్క పడి వుండడం కన్పించింది. అమ్మ మీ ఇంటి నంబరు చెప్పి ఫోన్ చెయ్యమంది. ఈలోగా పక్కింటి అంకుల్, ఆంటీ వచ్చారు. తర్వాత తెలిసింది - అక్క, రాత్రి అమ్మ నిద్ర పోయాక, అమ్మ నిద్రకని వాడే మాత్రలన్నీ మింగేసిందని." ఏడుస్తూ చెప్పాడు రాజీవ్.

వాడినలా చూస్తుంటే రామకృష్ణకి కడుపులో దేవేసినట్లు అనిపించింది. పాపం, పిల్లవాడు బెదిరిపోయాడు.

"సరే నాన్నా! ఇక ఊర్కో. అక్కకు ఏం కాదు. నాన్నకేం ఫర్వాలేదన్నారు, కదా డాక్టర్లు. నువ్వు కాస్సేపు సోఫాలో పడుకో. నేనొక మాటు హాస్పిటల్‌కి ఫోన్ చేసి - తర్వాత మనిద్దరికి క్యారియర్ తెస్తాను. అమ్మకు, అత్తయ్యకు ఏం కావాలో కనుక్కుంటాను." సోఫాలో రాజీవ్ పడుకోగానే, ఫోనందుకున్నాడు రమకృష్ణ.

* * *

శారద అదృష్టం బాగుండి గంగాధరం ఒక ఇరవై రోజులు హాస్పిటల్లో వుండి బయటపడగలిగాడు. భార్యా భర్తల పుణ్యఫలమనే అనుకోవాలి - శిరీష కూడా మృత్యువుతో పోరాడి క్షేమంగా ఇంటికి రాగల్గింది. ఆ నెల రోజులూ - శారదకి అండదండలుగా సరోజిని వాళ్ళ దగ్గరే వుండిపోయింది. రామకృష్ణ మాత్రం గుంటూరు - విజయవాడల మధ్య తిరిగేవాడు.

ఈ చేదు సంఘటనతో గంగాధరంలో అనూహ్యమయిన మార్పు వచ్చింది. ఉత్తేజానికి మారుపేరుగా గలగలా వాగుతూ, గంటల్ని నిమిషాల్లా పరుగెత్తించే ఆయనలోని వెనుకటి చైతన్యం మచ్చుకైనా కన్పించకుండా మాయమయింది. మనిషి మన్ను తిన్న పాములా మాంద్యంగా ముభావంగా - సమాధానాలను దాటవేయడం అలవాటు చేసుకు




న్నాడు.

ఒక నెల సెలవు పూర్తి కావడంతో జాబ్‌లో మళ్ళీ చేరిపోయాడు. గంగాధరం ఇంటి విషయాల్లో కానీ, పిల్లల విషయంలోకాని తన ప్రమేయం ఏమీ లేనట్టు ప్రవర్తించేవాడు. ఈ మార్పును ఎలా రిసీవ్ చేసుకోవాలో మొదట్లో శారదకు అర్ధమయ్యేది కాదు. ఇంకా షాకు నుండి తేరుకోలేదేమో అని మొదట భావించినా నెలలు గడుస్తున్నా అదే ధోరణి భర్త కొనసాగించడంతో బెంబేలెత్తి పోయి రామకృష్ణని రమ్మని కబురు పెట్టింది.

"శిరీషను ఏ కాలేజిలో చేర్పిద్దామండీ! పాత కాలేజికి మళ్ళీ వెళ్ళనని ఏడుస్తోంది!" అంటూ శారద, భర్తతో అంటే "నీ ఇష్టం" అంటూ సమాధానం వచ్చింది గంగాధరం నుంచి. ప్రశ్నేదయినా - సమాధానం ఒక్కటే - "నీ ఇష్టం" ఇదేదో తన సంసారం కాదన్నట్లు - తనకేమీ పట్టనట్లు.

రామకృష్ణ కూడా గంగాధరాన్ని మాట్లాడించి చూశాడు. అదే నిర్లిప్తత. అదే నిరాసక్తత. గంగాధరంతో గడిపిన ఆ రెండు రోజుల్లో రామకృష్ణకి ఒక విషయం అర్ధమయింది. కూతురు తల పెట్టిన ఆత్మహత్యా ప్రయత్నానికి తనే కారణం అన్నట్లు అందరూ తన వేపు చూస్తుంటే, సహించలేక, కోపాన్ని, అహంకారాన్ని అంతర్ముఖం చేసుకొని ఇలా ప్రవర్తిస్తున్నాడా గంగాధరం! గంగాధరంలో గూడు కట్టుకున్న ఆ సందిగ్ధ మానసిక స్థితి తొలగి పోవాలంటేఏ ఏం చేయాలి? ఆలోచించి, ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు రామకృష్ణ. గంగాధరంతో ముఖాముఖి మాట్లాడాలి. అతని అంతరంగం తెల్సుకోవాలి. అందరి కుటుంబ సభ్యుల మధ్య గంగాధరంతో చర్చించడం ఇష్టపడని రామకృష్ణ, గంగాధరాన్ని తీసుకుని ఆ రాత్రి కారులో నాగార్జునసాగర్ ప్రయాణమయ్యాడు.

విజయవిహార్‌లో ఆ రాత్రి ఇద్దరూ విశ్రమించారు. ఉదయమే లేచి స్నానం ముగించుకొని, సత్యనారాయణ స్వామి గుడికేసి నడిచి వెళ్ళారు ఇద్దరూ. గుడి ప్రాంగణంలో ఓ చెట్టు నీడన కూచుంటున్న గంగాధరానికి కేసి రామకృష్ణ అన్నాడు. "గంగా! అటుచూడు! ఉవ్వెత్తున లేచి ఒడ్డుసు తాకుతున్న ఆ కెరటాలను చూస్తే నీకేమని పిస్తోంది. అడ్డుకట్ట వేసి నన్నాపకపోతే సాఫీగా సాగి పోయేదాన్ని కదా!" అని ఈ నదీమ తల్లి అంటున్నట్లులేదూ?"

"కృష్ణా! ఆ క్రిష్ణయ్య సంగతి పక్కన పెట్టు కాస్సేపు. నీ మేన గోడలు ఆత్మ హత్య ప్రయత్నం చేసి ఎప్పటికీ లేవలేని చావు దెబ్బ కొట్టింది నన్ను. మనిషి నన్న మాటే కాని జీవం వున్న ప్రాణినికాదు కృష్ణా నేనిప్పుడు."

గంగాధరం మాటలకు విస్తుపోయాడు రామకృష్ణ. ఇన్నాళ్ళూ బావ మారిపోయాడేమో అనుకున్నాడు. కానీ ఇంతటి అగ్ని జ్వాలని తనలో ఇముడ్చుకొని కుమిలిపోతున్నాడని ఇప్పుడు గ్రహించాడు రామకృష్ణ. "బావా! ఎంత తప్పుగా ఆలోచిస్తున్నావు? ఓ బాలిక - ఇంకా పదహారు ఏండ్లు నిండని చిన్నారి - తన ప్రాణాలను తీసుకోవాలని ప్రయత్నించిందంటే ఆ పిల్ల ఎంత మధన పడితే ఆ నిర్ణయానికి వచ్చి వుంటుందో ఒక్క క్షణం ఆలోచించావా? ఆ పిల్ల బాధను అర్థం చేసుకోవడం పోయి - తనదే తప్పన్నట్లు మాట్లాడుతున్నావే! నీకిదేమయినా న్యాయంగా వుందా గంగా?"

"ఒక్క నా కూతురే కాదు కృష్ణా, నీ చెల్లెలి కూడా నన్ను అనరాని మాటలు అంది. శిరీష చని పోతే ఆ బాధ్యత నాదే అంది. నన్నొక హంతకుడిగ చిత్రించి నిందించింది. పిల్లలు బాగా చదివి అభివృద్ధిలోకి రావాలని, వాళ్ళ ఔన్నత్యాన్ని చూసి గర్వించాలని, కన్న తల్లితండ్రులు కలలు కనడం తప్పంటావా? నేనలా ఆలోచించడం నేరమం

టావా? కన్న బిడ్డలు తల్లితండ్రుల ఆశలను నెరవేర్చాలని అనుకోవడం పేరాశ అవుతుందా? తన సంతానం పట్ల ఏ విధమయిన కోర్కెలు పెంచుకోవడం స్వార్థం మవుతుందా?''

గంగాధరం మాటల్లోని ఆందోళన గమనించి ఒకింత తగ్గాడు రామకృష్ణ.

"గంగా! నువ్వన్నది కరెక్టే. కానీ నేను చెప్పే విషయాన్ని గురించి నువ్వు నిదానంగా ఆలోచించు. ఆలోచించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు. ఎంతసేపూ మన పిల్లలు - వాళ్ళేదో మన స్వంతం అన్నట్లు, మనం కని పోషిస్తున్నాం కాబట్టి వాళ్ళ మీద మనకు పూర్తి అధికారం వున్నట్లు ప్రవర్తిస్తాం. మనలాగే వాళ్ళు ఆలోచించాలని, నడుచుకోవాలని ఆకాంక్షిస్తాం.

వాళ్ళ అభిరుచులు, ఇష్టా ఇష్టాలు, పెరిగే వాతావరణం పరిసరాలు, ప్రభావాలు, శారీరక మానసిక ఉద్వేగాలు, ఒత్తిళ్లు, వీటి అన్నిటి గురించి మనం ఎప్పుడయినా ఆలోచిస్తున్నామా? మనం పిల్లల మీద ఎన్నో ఆశలు పెట్టుకుంటాం. నిజమే, కానీ దేనికయినా లిమిటేషన్స్ వుంటాయి. మరిచి పోయావా గంగా! ఆనాడు నువ్వు కలెక్టరు కావాలని మీ నాన్న కలలు కన్నాడు. నువ్వు కాగలిగావా? ఇర్రిగేషన్ డిపార్ట్మెంటులో గుమాస్తా కాగలిగావు.''

"అదే కదా నా బాధ. అప్పట్లో నాన్నకి - ఇప్పట్లో నాకున్న హోరైజన్ లేదు. శక్తి సామర్థ్యాలు లేవు. ఆర్థిక స్తోమత అసలే లేదు. కోచింగ్ సెంటర్‌లో చేరి చదివే తాహతులేక మా నాన్న కోర్కెను తీర్చలేకపోయాను. కానీ నా పిల్లలు అలా కాదే! నాకెన్ని కోర్కెలున్నా వాటినన్నిటిని చంపుకొని వాళ్ళ చదువు కోసమే పాటుపడ్తున్నాను. అంతంత ఫీసులు, డొనేషన్లు పోసి వాళ్ళను చదివించాల్సిన అవసరం నాకేమొచ్చింది. అద్దె కొంపలోనే పడివున్నాను, ఇప్పటికీ, హాయిగా ఆ డబ్బును మదుపు పెట్టి ఏ ఫ్లాటో కొనుక్కొని వుండొచ్చు గదా?''

గంగాధరం మాటలకు కొంచం నవ్వొచ్చింది రామకృష్ణకి. "గంగా! అక్కడే నువ్వు పొరపాటు పడ్తున్నావు. పిల్లలు స్కూళ్లల్లో ఫస్ట్ వచ్చినంత మాత్రాన ఏ చదువుల్లో అయినా రాణించేసి అన్నింట్లో ముందంజ వేస్తారనుకోవడం తప్పు. పాఠశాల స్థాయి వరకు పిల్లలు అపరిపక్వ దిశలో వుంటారు. బాల్యం తర్వాత వచ్చే కౌమార్యదశ అది. వాళ్ళల్లో ఉత్సాహాన్ని నింపుతుందే తప్ప జీవితానికి కావల్సిన వ్యక్తిత్వాన్ని సమకూర్చుకునే శక్తి ఇవ్వలేదు ఆ వయస్సు. ఇక ఇంటర్ లెవల్‌కి వచ్చేసరికి వారి మేధస్సు పెరగడమే కాక వాళ్ళకి ఏమి కావాలో అది - తెల్సుకొనే విచక్షతను కూడా కొంతలో కొంత సంపాదించుకుంటారు. ఇదిగో - ఈ వయస్సులోనే పిల్లల్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి తల్లితండ్రులు. వాళ్ళకు అండ దండలుగా వుంటూ వాళ్ళ ప్రవర్తనని జాగ్రత్తగా గమనించాలి. "మాకు ఏది ఇష్టమో అదీ మా పిల్లల ఇష్టం కావాలి'' అనే నిరంకుశ ధోరణి పెద్దలు మార్చుకోవాలి. గంగా! ఆగు! నన్ను పూర్తిగా చెప్పనియ్యి - ఇప్పుడు శిరీష విషయమే తీసుకో. నువ్వన్నా - శారద అన్నా దానికి వల్లమాలిన ప్రేమ. చిన్నప్పటి నుండి అల్లారు ముద్దుగా పెంచారు దాన్ని. ప్రేమ పూరితమయిన వాతావరణంలో పెరగింది. అందులో కొంత సెన్సిట్యివ్ కూడా - ఆ వయస్సులో అందరూ సెన్సిట్యివ్‌గాను వుంటారు, ముఖ్యంగా ఆడపిల్లలు. అటువంటి పిల్లని తీసుకెళ్లి క్రమశిక్షణ, **24** గంటలు టెస్ట్లు, ర్యాంకులు, ప్రతిష్ట అంటూ ఆ రెసిడెన్షియల్ కాలేజిలో చేర్పించావు. శిరీష లాంటి పిల్లలు ఎందరు చదవడం లేదు ఆ కాలేజిలో అంటూ నువ్వ అడగొచ్చు. నిజమే అందరి పిల్లల మనస్తత్వాలు ఒక్కలా వుండవు. కొందరు బాగా ఫాస్ట్‌గా వుంటే, కొందరు స్లోగా వుంటారు. కొందరు చాలా సెన్సిట్యివ్‌గా వుంటారు. చిన్న చిన్న వాటికే ఆందోళనకు గురి అయి కుమిలిపోతారు కొందరు. కొందరికి ఆత్మ విశ్వాసం ఎక్కువ. ప్రతి విషయాన్ని పాజిటివ్ అవుట్ - లుక్‌తో ఆలోచిస్తారు. చిన్న చిన్ని సమస్యలకు చిన్న బోరు వీళ్ళు.

శిరీషకి మార్కులు తక్కువ వచ్చాయని బాధపడి దాని మీద కోపగించుకున్నావే కాని ఎందుకు రాలేదో కొంత సానుభూతితో శిరీషతో చర్చించి వుంటే బాగుండేది. ఆ ప్రోగ్రెస్ రిపోర్టులోని మార్కులు, ఆ నెలలో తన పర్‌పార్‌మెన్స్‌కు కొలబద్ద కావచ్చునేమో కాని ఆ పిల్ల మేధాశక్తికి, బుద్ధి, ప్రజ్ఞలకు కొలమానమని అనుకుంటే ఎలా?

నువ్వు ఊహించిన అంచులకు తను అందుకోలేక పోతున్నానని ఆత్మ న్యూనతా భావంతో, భరింపరాని ఆందోళనకు గురయి, క్షణికంగా తనలో ఉద్భవించిన ప్రతిక్రియను అమలు చేసేందుకు ఆత్మహత్యకు ప్రయత్నించింది. తన మీద తనకు కల్గిన అపనమ్మకంతో తాను శిక్షించుకుంది. కానీ నిన్ను బాధ పెట్టాలనీ కాదు, నీ మీద దెబ్బకొట్టాలనీ కాదు. గంగా! ఒక్కటి మాత్రం గుర్తు పెట్టుకో! జీవితంలో ఏదయినా సాధించవచ్చు. ప్రయత్నించి పొందవచ్చు. కానీ పోయిన ప్రాణాన్ని మళ్ళీ తిరిగి తెచ్చుకోలేం. శిరీష బ్రతికి బయటపడింది. అది నీకు ఓ అమూల్య వరం. అలా కాక మరో విధంగా జరిగి వుంటే జీవితాంతం నువ్వు అపరాధభావంతో కుమిలిపోయేవాడివి. అదేదో నీ 'ఈగో' దెబ్బతిందని భావించి నీ కూతుర్ని నిర్లక్షం చెయ్యడం సబబేనా? పువ్వులాంటి ఆ పిల్ల మనస్సు ఇప్పటికే బాగా నలిగిపోయి వుంది. ఇంకా దాన్ని వెతలపాలు చేయకు. ఈ రోజుల్లో ఎందరో తల్లితండ్రులు తమ పిల్లల భుజస్కందాల మీద మోయలేని బరువును - చదువు నెపంతో - మోపి వాళ్ళ వెన్ను విరుస్తున్నారు.

ఏం - ఇంజనీర్లో, డాక్టర్లేనా ఈ సంఘంలో గుర్తింపబడేవారు. ఇక మిగతా వృత్తుల్లో వున్నవారు మనుషులు కారా? ఈ కంప్యూటర్లు జాతి పురోగతికే వచ్చాయో, మానవ సంక్షోభానికో వచ్చాయో అని నాకు అప్పుడప్పుడూ సందేహం కల్గుతూంటుంది!

నేటి విద్యా విధానం, తాము ఓనాడు ఆశించి చేరుకోలేక పోయిన అంతస్తులకు తమ పిల్లలు చేరుకోవాలన్న తల్లితండ్రుల తపన, పెరిగిన సుఖ జీవన లాలస, పోటీ తత్వం, మితి మీరిన ఆశలు, ఆకాంక్షలు - వీటి విషకోరల్లో చిక్కుకొని నలిగిపోతున్నారు. ఈనాటి విద్యార్థినీ విద్యార్థులు. ఏ పత్రికలో చూసినా చదువుల ధాటికి, కాంపిటీషన్ల ధాటికి తట్టుకోలేక మృత్యువును ఆహ్వానిస్తున్న పిల్లలు ఒకరిద్దరో కన్పించకపోరు నిత్యమూ. ఇదేమయి నా సబబయిన పద్ధతా? సంఘంలో ఇటువంటి వాటిని నిరోధించాల్సిన అవసరం సంఘంలో విద్యాధికులయిన మన మీద లేదా? ప్రతి రోజూ ఎందరో తల్లితండ్రుల కన్నీటి గాథలను గురించి చదువుతూ, ప్రత్యక్షంగా చూస్తూ వున్నా కూడా మనకు బుద్ధి రావడం లేదు.

గంగా! శిరీషను ఓ మారు చూశావా? దాన్ని ఈ మధ్య పల్కరించావా? మొన్న ఏమందో తెల్సా - "మామయ్యా! నేను రెసిడెన్షియల్ కాలేజీకి వెళ్ళడం లేదని నాన్న బాధ పడ్తున్నట్లున్నారు. నేను మళ్లీ అక్కడికే వెళ్తాను' అంది చిట్టి తల్లి. ఎంత బాధపడ్తూ అందో ఆ మాట చెప్పు గంగా! మళ్ళీ దాన్ని తన కిష్టంలేని పని చెయ్యమని చెప్పగలవా?''

రామకృష్ణ మాటలకు కదిలిపోయాడు గంగాధరం. బావ భుజం మీద తలవాల్చి అలా వుండిపోయాడు. భుజాల కదలికతో గంగాధరం వెక్కుతున్నట్లు అర్థమయింది రామకృష్ణకి. కాస్సేపు అలాగే వుండి "ఇక వెళ్దామా గంగా అంటూ లేచాడు రామకృష్ణ. మారు మాట్లాడక రామకృష్ణను అనుసరించాడు గంగాధరం.

ఆ రాత్రి విజయ విహార్‌లో గడిపి. మరుసటి దినం గుంటూరుకి బయలుదేరారు ఇద్దరూ.

విజయవాడ చేరిన వారం రోజులకు శారద నుండి ఫోన్ వచ్చింది రామకృష్ణకు.

"అన్నయ్యా! శిరీషని ఇప్పుడు ఇక్కడి కాలేజిలో చేర్పించాము. రెసిడెన్షియల్ కాలేజికే పంపుదామని నేనంటే నన్ను నాల్గు కేకలేసి దాన్ని ఇంటికి దగ్గరగా వున్న ఉమన్స్ కాలేజిలో చేర్పించారు మీ బావ. అన్నయ్యా! ఆయన ఇప్పుడు మునుపటిలాగే పిల్లలతో నవ్వుతూ, నాతో దెబ్బలాడుతూ, ఇల్లంతా సందడితో నింపేస్తున్నారు.''

శారద గొంతులోని ఉత్సాహాన్ని, ఆనందాన్ని గమనించిన రామకృష్ణ నిశ్చింతగా ఒక నిట్టూర్పు విడిచాడు.

❋